


# చంద్రమ్మకు కోపం వచ్చింది

**కోటూరి విజయ కుమార్**

**No** person shall be deprived of his life or Personal liberty except according to the procedure established by law

- No person who is arrested shall be detained in custody without being informed, as soon as may be, of the grounds for such arrest.

Articles 21 - 22 of Indian Constitution

సిటీలో వున్న చెప్పుకోదగ్గ సెంటర్లలో అది కూడా ఒకటి

ఇరవై నాలుగు గంటలూ వాహనాలు తిరిగే రోడ్డు ......... ఒక పక్కన చిన్న గార్డెన్, మరోపక్కన లేడీస్ కాలేజ్, గార్డెన్‌కి కాస్త దూరంగా ఒక వైపున ఉన్న వాళ్ళ మేడలు, మరోవైపున ఎల్లవేళలా వాళ్ళ సేవలో సిద్ధంగా వుండేందుకు చిన్న, చిన్న గుడిసెలు .......... కాలేజీకి కొద్ది దూరంలోనే రెండు జంట థియేటర్లు ...... వాటి వరుసలోనే బిజీ, బిజీ షాపింగ్ కాంప్లెక్సు ........ ఎవరి అవసరాల కోసం వారు పరుగులు తీస్తూ జనం ....... జనం ....... !

ఈ జనం అంతా ఒక ఎత్తయితే ....... కాలేజీలోని 'ఆడజనం' కోసం పడిగాపులు కాస్తూ, కాలేజీకి ఎదురుగా రోడ్డుకీవలివైపున్న బస్‌స్టాప్‌లో 'కుర్రమగజనం' !

సమయం దాదాపుగా మధ్యాహ్నం పన్నెండున్నర అయివుండొచ్చు.

కాలేజీ వొదిలిపెట్టబడి, అమ్మాయిలంతా వొచ్చేసే సమయం !

గుడిసెల కాలనీ నుండి అప్పుడే కాలినడకన బస్‌స్టాపు చేరుకున్నారు ఒక నడివయస్కురాలు, ఒక కుర్రవాడు.

ఆ నడివయస్కురాలి పేరు చంద్రమ్మ. వయసు నలభైకీ, యాభైకీ నడుమ వుంటుంది గానీ, రెక్కల కష్టం చేసీ, చేసీ అవయ్యేళ్ళు దాటిన వృద్ధురాలిలాగా కనిపిస్తుంది.

ఆ కుర్రవాడి పేరు రాములు. వయసు పదిహేడు దాకా వుంటుంది. చూడడానికి మాత్రం పాతికేళ్ళ వాడిలా వుంటాడు. స్వతహాగా వాడికిష్టం లేక పోవడం వల్లనయితేనేమి, గర్భదారిద్ర్యం చదవనీకుండా చేయడం వల్లనయితేనేమి వాడు ఏడో తరగతి తరువాత, మరింక వాళ్ళ వూరి స్కూలుని యిబ్బందిపెట్టలేదు.

బస్సుషెల్టరు కింద వున్న బెంచీమీద కుక్కల్లా చొంగకార్చుకుంటూ లేడీస్ కాలేజీ గేటువైపు చూస్తోన్న కుర్రవాళ్ళు కూర్చోవడం మూలాన, ఖాళీ లేకపోవడంతో చంద్రమ్మ, రాములు ఒకపక్కగా నిలబడ్డారు.

"కొంచెమాగితె బస్ టెసన్‌కు బొయ్యె పచ్చబస్సొస్తది కొడుకా ! ....... టేసన్‌కని చెప్తె రూపాయి దీస్కుంటడు. టేసన్‌ల దిగినంక మావూరికి వొయ్యే బస్సు నీకెరికె గదా !..... జరంత పయిలంగ బోర్డు సదూకోని ఎక్కు కొడుకా!" రాముతో జాగ్రత్తలు చెప్పింది చంద్రమ్మ.

"అట్లనె పెద్దమ్మా!" తలూపి సమాధానమిచ్చాడు రాములు.

"అమ్మను, నాయినను అందర్నీ అడిగిన్నని జెప్పు కొడకా ..... " మాట్లాడ్తోన్న చంద్రమ్మకి ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చి, చీరకొంగుతో వొస్తున్న కన్నీళ్ళని అదిమిపెట్టే ప్రయత్నం చేసింది.

"ఎప్పుడు మీ వూరొద్దామన్నా ఈ ముదనష్టపు సంసారంతోటి తీరదాయె ..... ఒక్కరోజు కనీసం వొంట్ల బాగలేకుంటె అంట్లుతోమెడాన్కి పోకుంటేగుడ, నిన్ను దీశేసి యింకో పనిదాన్ని పెట్టుకుంటమని ఆ బిల్డింగుటోళ్ళు బెదిరిత్తరు ...... మీ పెదనాయినను సూత్తె అయిన పెండ్లాంకన్న ముందు సారాసీసాకు పుస్తెకట్టిండు ...... యెక్కడి పైసలూ తాగుడుకే సరిపోవాయె ..... ..... అమ్మను సూడిక శాన రోజులయ్యింది కొడుకా ! ..... ఒక్కసారి సూడాల్నని పానం తన్లాడతాంది. ఇంకో

కొడుగ్గావాలి. యింకో కొడుగ్గావాలెనని మా అయ్య నే వెన్క ఐదుగురు ఆడపోరగాండ్లను గని అవ్వను బతికుండంగనె పీనుగాను జేసె ..... యింకా పోరగాండ్లను గంటె అవ్వ బతకది కొడుగా ..... అందరు గల్సి అయ్యకు నచ్చజెప్పుండ్లి ..... పోరగాని కోసమని వున్నా పోరగాండ్లకు అవ్వలేకుంట జేత్తడా ఏంది ముదనష్టపోడు" చంద్రమ్మ యింకా అట్లా ఏడుస్తూనే మాట్లాడ్తోంది.

"ఏడ్వకే పెద్దమ్మా! ..... నువ్వు ఏడ్తాంటె నాకు ఏడుపొత్తాంది. మా అమ్మకు గూడ నీమీద శాన ప్రేమ! ..... ఒక్క తల్లికడుపుల బుట్టి గూడా దాని సంగతి నాకు, నా సంగతి దానికీ యెర్కగాకుండ పరాయినోళ్ళ లెక్కన బతుకుతానమని అమ్మ వూరికె ఏడ్తది. అందుకె, నిన్నొకపాలి సూశొత్తనని అమ్మకు జెప్పివొచ్చిన" చేతిలోని సంచిని క్రిందపెట్టి, చంద్రమ్మను అనునయిస్తూ అన్నాడు రాములు.

ఆమాటలలో చంద్రమ్మ కొంచెం తెప్పరిల్లింది.

చేరకొంగుతో కన్నీళ్ళని తుడిచేసుకుంది.

"సంచిసైలం కొడుకా ..... బస్సులల్ల దొంగలు గిట్ల వుంటారు" రాములుకి జాగ్రత్తలు చెప్పింది.

"అచ్చం మా అమ్మ జెప్పినట్టె జెప్పినవ్!" కిసుక్కున నవ్వాడు రాములు.

ఒకసారి సంచీ విప్పి చూసుకున్నాడు.

దొంగలు ఆశపడేంత గొప్ప వస్తువులేవీ అందులో లేవు.

పాత న్యూస్‌పేపర్‌లో చుట్టబడిన రాములు బట్టలు ఒక జత ..... అడుగున తన పెద్దమ్మ, తమ కోసం ప్రేమతో చేసి పంపిస్తోన్న కారప్పూస !

రాములు చిన్నగా నవ్వుకొని, సంచీని భుజానికి తగిలించుకున్నాడు.

ఇంతలో చిట్టచివరిగంట మోగడంతో, కాలేజీ గేటు తెరిచారు. బస్సు షెల్టరులో కలకలం మొదలయ్యింది.

"అబ్బ ..... పంజరం తెరిచారు గురూ ! ....... యింక చిలకలు గుంపులు, గుంపులుగా వొస్తాయ్!"

"ఇవాళ మా మాధురీ దీక్షిత్ కాలేజీకి వొచ్చిందంటావా ?

"ఏ మోగురూ ...... కొంచెం డౌటే ! .....అయినా మాధురీ దీక్షిత్ మిస్సయితే యేంటి ..... మా జుహీచావ్లా కంపల్సరీగా వొస్తుంది!.... అద్సరేగానీ యివాళ మా బ్యూటీ కన్పించకపోతే పట్టాల పక్కన తలపెట్టి, రైలుకిందపడి చచ్చిపోతానని బెట్టు కాసావ్ ..... గుర్తుందా ?"

"ఉత్త 'బ్యూటీ' అని సింపుల్‌గా అంటావేంటి బాసూ ? ...... సుస్మితాసేన్ అనిపిలు బాసూ !

***"యూ రాస్కెల్! ...... సిగ్గులేదూ ఆ మాట చెప్పడానికి ? ...... ఖాకీ డ్రెస్సు, లాఠీ యివ్వడం అంటే ప్రజల ప్రాణాల్ని ఇంటరాగేషన్‌లో తీయడానికి ప్రభుత్వం యిచ్చిన లైసెన్సు అనుకున్నావు? ..... నీలాంటి స్కాండల్స్ వల్ల పోలీసు డిపార్టుమెంటు పరువుపోతోంది***

"ఛా! ..... యింకా నయం ..... చుట్టుపక్కలెక్కడా సుస్మితాసేన్ లేదు"

సరిగ్గా అప్పుడే మెరుపు వేగంతో బస్‌షెల్టర్‌ను చేరుకున్న నీలిరంగు జీపు 'సడన్‌బ్రేక్'తో అక్కడ ఆగింది.

షెల్టర్‌లో బైఠాయించిన వాళ్ళందరూ ఒక్కవుదుటున తలొక దిక్కుగా దూరంగా పరుగెత్తారు.

చంద్రమ్మ, రాములు యిద్దరూ అక్కడ సడన్‌గా ఆగిన జీపువైపు చూస్తూ నిలుచున్నారు.

జీపులోంచి దిగిన ఇన్‌స్పెక్టర్ లాఠీని వూపుతూ ఒకసారి చుట్టూ చూశాడు. ఇంతదాకా బస్సు షెల్టర్‌లో బైఠాయించిన వాళ్ళంతా, యిప్పుడు కాస్త దూరంగా వెళ్ళి నిలబడి, ఆగివున్న జీపుని, ఇన్‌స్పెక్టర్‌ని చూస్తున్నారు. "ఎవడుకూడా మన ఒంటిమీద ఒక్క ఈకకూడా పీకలేడు" అన్న ధీమా వాళ్ళ కళ్ళల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

బస్సుషెల్టర్‌కి కాస్త దూరంగా నిలబడిన రాములుపై దృష్టి పడడంతో అటుకేసి నడిచాడు ఇన్‌స్పెక్టర్. అతడు కొంచెం తూలుకుంటూ నడుస్తున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. అతడి రెండుకళ్ళూ రెండు ఎర్రలైట్లలా భగభగమంటున్నాయి.

"ఏంజేస్తానవ్‌రా యిక్కడకి" రాములుని సమీపించిందే తడవుగా అతడి కాలర్‌ని తన పిడికిట్లో బిగించి హుంకరిస్తూ అడిగాడు.

జరుగుతున్నదేమిటో అర్థంగాక యిద్దరూ బిత్తరపోయారు.

"టేసన్‌కు బోవాల్నని లోకల్‌బస్ కోసం యిక్కడ నిలబడ్డం సారూ!" ముందుగా తేరుకున్న చంద్రమ్మ సమాధానమిచ్చింది. ఆమె గొంతులో వణుకు స్పష్టంగా తెలుస్తోంది. పెద్దపులిని చూసినట్టుగా వాళ్ళిద్దరికళ్ళూ భయం, భయంగా ప్రకంపిస్తున్నాయి.

"నిన్నడుగుతె ముసల్ది జెప్పుతాందేందిరా?" ఇన్‌స్పెక్టర్ నోట్లోంచి వస్తోన్న వాసన యిద్దరి ముక్కుపుటాల్ని చీలుస్తూ, కడుపుల్లోంచి దేవినట్టుగా భయంకరంగా, భరించలేనిదిగా వుంది.

"అవున్సార్!....పెద్దమ్మ నిజం జెప్పింది!" ఎలాగో ధైర్యం కూడగట్టుకుని చెప్పాడు రాములు. "నీయవ్వ.... నీకంటికి నేను బేవకూఫ్‌గానిలెక్క కనబడతాన్రా బాడకవ్!.... పోరీలకు సైటుకొట్టడాన్కి బస్సుస్టాపుతాన నిలుసుండి, బస్సుకోసం నిలుసున్నానని నాకు తిన్క జెప్పుతవ్‌రా!" ఇన్‌స్పెక్టర్ బిగ్గరగా అరుస్తూ, చేతిలోని లాఠీతో రాములు వొంటిమీద పిచ్చెత్తినవాడిలా మూడు, నాలుగు దెబ్బలు బలంగా కొట్టాడు.

"నాకేందెల్వాదుసార్.... నీ

కాళ్ళొక్కుక్కతా.... సన్నిడిసిపెట్టు!" లాఠీదెబ్బలు వొంట్లోని ప్రాణాల్ని తోడేయడంతో, నేలమీద పడిపోయిన రాములు, రెండు చేతులూ జోడించి దీనంగా ఇన్స్పెక్టర్‌కి నమస్కరిస్తూ వేడుకున్నాడు.

ఊహించని హఠాత్‌పరిమాణానికి బెంబేలెత్తిపోయిన చంద్రమ్మ, ఒక్క వుదుటున వెళ్ళి, రాములుని మళ్ళీ కొట్టబోతున్న ఇన్స్పెక్టర్ కాళ్ళని తన రెండు చేతులతో చుట్టేసింది.

"పసోడు, వానికేందెలవదు సారూ!...వాన్ని వొదిలెయ్యండ్రి... మీ కాళ్ళు మొక్కుతా... ఇప్పటిదాకా ఈడు కూసున్న పోరగాండ్లంతా జీపు సూడంగానే దూరంగా వురికిండ్లు".

బలమంతా వుపయోగించి, కాలితో చంద్రమ్మను ఒక్కతోపు తోసాడు. ఆ విసురుకు చంద్రమ్మ వెళ్ళి, రాములు పక్కనే పడిపోయింది.

"ఒక్కన్నేవొచ్చి సైటుగొడితే పోలీసోళ్ళు పట్టుకుపోయి చెమ్డాలూడదీత్తరని, గీ ముసల్దాన్ని తోడుదీసుకొచ్చినవారా!... మీ అందర్కీ నేను గాజులు దొడుక్కున్న పోలీసోనిలెక్క అగుపిత్తాన్నరా!...బొక్కలల్లకు సున్నం లేకుంట దంచుతా సాలె ఏమనుకున్నవో" ఇన్స్పెక్టర్ అక్కడే నిలబడి చుట్టూ కలియజూస్తూ, నోటికి వొచ్చిన బూతుల్ని వుపయోగిస్తూ అన్నాడు.

అప్పటిదాకా బస్‌షెల్టర్‌లో కూర్చున్నవాళ్ళంతా తమవల్ల ఒక అమాయకుడు శిక్షింపబడతూ వుంటే, తమాషా చూసినట్టు చూస్తూ కూర్చున్నారు.

"గురుడు ఫుల్లు లోడు మీదున్నాడు గురూ!"


"అధమపక్షం ఆఫ్ బాటిలయినా కొట్టందే మనోడు యూనిఫామ్ తొడుక్కోడంట గురూ!"

"సంపూర్ణ మద్యనిషేధం అని జనాలు ఓ తెగయిదిగా గోల చేస్తున్నారు గదా!"

"అట్టాంటివి లా అండ్ ఆర్డరు చేతిలో వున్నోడికి కాదు బాసూ!"

"పాపం వృత్తిపుణ్యానికి ఆ పల్లెటూరోడు దొరికిపోయాడుగురూ!"

"యూనిఫామువేస్కున్నోడు...మందేస్కుంటే మాత్రం వాడికి తెలీదేంటీ...?...మనం చూస్తున్నామని ఎగ్జిబిషన్ ...చిన్న బిల్డప్పు....అంతే!" వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడుకుంటూ, ఇన్స్పెక్టర్ చేష్టల్ని చూస్తూ, నవ్వుకుంటున్నారు. పిచ్చికుక్కలా అరుస్తూ అటూ, యిటూ తిరిగిన ఇన్స్పెక్టర్ ఒక నిర్ణయానికి వొచ్చినవాడిలా రాములుని సమీపించి, క్రిందపడివున్న అతడిని కాలర్ పట్టుకుని పైకి లేపాడు. రాములు భుజానికి వున్న సంచీలోంచి కొంత కారప్పూస క్రింద దుమ్ములో కలిసిపోయింది.




"రోజు టేషన్‌ల ఆడపోరగాండ్ల అయ్యలు యిచ్చే కంప్లెయింట్లతోటి దిమాక్ ఖరాబైపోతాంది!...యిట్ల కాదుగాని టేషన్‌కు దీస్కబోయి నాలుగు గట్టిగ దగిలిత్తెగాని మీకు బుద్ధిరాదురా!" రాములుని బరబరా ఈడ్చుకుపోయి జీపులో విసిరేసాడు.

"మీకు దండంపెడ్తదొరా!... నా కొడుకునేం జెయ్యకుండ్లి..."... నా కొడుకునేం జెయ్యకుండ్లి..." " చంద్రమ్మ పరుగెత్తుకెళ్ళి జీపుప్రక్కన కిందపడిపోయి ఇన్స్పెక్టర్ కాళ్ళను పట్టుకుంది.

అతడు ఏదీ వినిపించుకునేలా లేని ఒక ఉన్మాదస్థితిలో వున్నాడు.

జీపు స్టార్టయి, మృత్యుశకటంలా ముందుకు దూకింది..... దారిమీది దుమ్మును పైకి రేపుతూ.... !

పైకిలేచిన దుమ్మంతా చంద్రమ్మ నెత్తిమీదా, బట్టలమీదా కురిసింది.

చంద్రమ్మ నెత్తి, నోరు కొట్టుకుంటూ, అలాగే ఏడుస్తూ కూర్చుంది.

అప్పటిదాకా మృగానికి భీతిల్లి, దూరంగా నిలబడ్డవాళ్ళంతా ఒక్కరొక్కరే వొచ్చి, చంద్రమ్మ చుట్టూ మూగారు. ఎవరో ఒక సోడా తెప్పించి చంద్రమ్మ చేత తాగించారు.

"మరేం భయంలేదమ్మా!...... వాడు బాగా తాగున్నాడు...... పో...... పోయి పోలీస్‌స్టేషన్ దగ్గిరనే కూర్చో..... రాత్రికి మావోడిని వొదిలేస్తాడు".

అందరూ సలహాయిచ్చారు.

చంద్రమ్మ ఓపికంతా కూడదీసుకుని లేచి నిలబడింది.

"మా సెల్లెకు వాడొక్కడే కొడుకు నాయనా!..... పోలీసోళ్ళు వాన్నేమన్నా జేత్తె నా సెల్లెకు మరిదికి నేనేం జెప్పుకోవాలె"

"ఏడవకమ్మా ..... ఏడిస్తే పోలీసోళ్ళు కరిగిపోరు ..... ఎవరైనా తెలిసిన వాళ్ళుంటే వాళ్ళని తీసుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లు!"

"గుడిసెల వుండి, నాలుగిండ్లు దిరిగి అంట్లు దోముకొని బతికేటిదాన్ని నాకెవలు దెలుసు నాయినా!"

"ఎవరూ తెలీకున్నా ఫరవాలేదమ్మా! వెళ్ళి పోలీస్‌స్టేషన్ దగ్గరే కూర్చో!...... రాత్రికి వాడే నీ కొడుకుని వొదిలేస్తాడు!"

ఒక నిర్ణయానికి వొచ్చినదానిలా

చంద్రమ్మ పోలీస్ స్టేషన్‌కేసి అడుగులేసింది.

*** *** ***

చంద్రమ్మ శోకమూర్తిలా అట్లా పోలీస్‌స్టేషన్ ముందు కూర్చుని, అప్పటికి ఆరుగంటలపైగానే అయ్యింది.

ఎంతగా బతిమాలుకున్నా ఎవరూ ఆమెని పోలీస్‌స్టేషన్ లోపలికి అడుగుపెట్టనీయలేదు.

లోపల రాములుని ఏం చేస్తున్నారో, ఎలా వున్నాడో అన్న ఆలోచనలే క్షణక్షణం చంద్రమ్మ గుండెను రంపపుకోత కోస్తున్నాయి.

అప్పటికి మూడోసారి సెల్‌లోకి వెళ్ళి, రాములుని గొడ్డున బాదినట్టు బాదిన ఇన్స్పెక్టర్ తాపీగా వొచ్చి కుర్చీలో కూర్చుని, ఎదురుగా వున్న బెంచీపైన కాళ్ళుబార్లా చాపుకుని విశ్రాంతిగా సిగరెట్ పీలుస్తున్నాడు.

హెడ్ కానిస్టేబుల్ వెల్లిగా ఇన్స్పెక్టర్‌ని సమీపించి, అతడిచెవిలో 'రహస్యం' చెబుతున్నట్టుగా అన్నాడు-

"సార్..... ! మీరు జీపుల యేసుకొచ్చిన పోరగాని పానం బోయింది ...... ముక్కుకాడ, గుండెమీన చెయ్యి బెట్టి సూశిన .... కాళ్ళుజేతులు సల్లబడ్డయ్!"

విశ్రాంతిగా కూర్చున్న వాడల్లా, సిగరెట్ పీకను పక్కన గిరాటువేసి, స్ప్రింగ్‌లా నిలుచుని, వేగంగా సెల్‌లోకి ప్రవేశించి, రాములు దేహాన్ని పరిశీలించాడు.

సందేహం లేదు....... ప్రాణం పోయింది!

ఇన్స్పెక్టర్ మందుమత్తంతా దిగిపోయినట్లనిపించింది.

జేబులోంచి కర్చీఫ్ బయటకు తీసి, ముఖానికి పట్టిన చెమట బిందువులను తుడుచుకున్నాడు.

"సార్ ......! బయట ముసల్ది వినికోసం సూస్కుంట యింకా అట్లనె కూసున్నది"

"దాని సంగతి వొదిలెయ్ ......! దానికేం జెప్పాల్నో, ఎట్ల జెప్పాల్నో నాకెరికె! ..... ముందు దీన్ని పరిష్కారం జెయ్యాలె!"

ఇన్స్పెక్టర్ బుర్ర చక, చకా పనిచెయ్యడం ప్రారంభించింది.

హెడ్‌కానిస్టేబుల్‌కి రహస్యంగా ఏదో చెప్పాడు.

కొద్దినిమిషాల వ్యవధిలోనే అతడు చెప్పింది అమలయ్యింది.

రాములు సంచిలోంచి అతడి బట్టలు వగయిరా పారవేయబడ్డాయి.

ఇప్పుడు వాటిస్థానంలో అదే సంచిలో కొన్నినాటుబాంబులు, తుపాకీ బుల్లెట్లు, కొన్ని పత్రాలు చేర్చబడ్డాయి.

పావుగంట తరువాత వొచ్చి కుర్చీలో కూర్చుని, కొద్దిసేపు బలంగా వూపిరి తీసుకుని ఫోన్ డయల్‌చేశాడు.

"హలో! దిసీజ్ యస్పీ సారథి స్పీకింగ్!"

"నమస్తె సార్! ......నె ..... నె ..... నేను వన్‌టౌన్ యస్సైని మాట్లాడ్తాన సార్!"

"చెప్పు!"

"ఇయ్యాల లంచ్ టైముల లేడీస్ కాలేజి ఎదురుంగ వున్న బస్టాపుల ఓ పోరగాడు అనుమానంగా తిరుగుతాంటే స్టేషన్‌కు బట్టుకొచ్చిన సార్! ...... వానిదగ్గరున్న సంచిల కొన్ని పేపర్లు, బాంబులు, బుల్లెట్లు దొరికినయ్ సార్!"

"వెరీగుడ్! ...... స్పెషల్ స్క్వాడ్‌వాళ్ళకు ఇన్‌ఫామ్ చేశావా?"

"లేద్సార్ ! ..... చిన్నబ్యాడ్‌లక్కయింది ! ...... ఆ పోరగాడ్ని ఇంటరాగేట్ చేస్తాంటే పానం బోయింది ...... " అతడింకా మాట పూర్తి చేయలేదు.

అవతల్నించి యస్పీ కంఠం ఖంగుమంది.

"యూ రాస్కెల్! ...... సిగ్గులేదూ ఆ మాట చెప్పడానికి ? ...... ఖాకీ డ్రెస్సు, లాఠీ యివ్వడం అంటే ప్రజల ప్రాణాల్ని ఇంటరాగేషన్‌లో తీయడానికి ప్రభుత్వం యిచ్చిన లైసెన్సు అనుకున్నావు? ..... నీలాంటి స్కౌండ్రల్స్ వల్ల పోలీసు డిపార్టుమెంటు పరువుపోతోంది ..... అవతల సమాధానం చెప్పుకోలేక నాలాంటి వాళ్ళం చచ్చిపోతున్నాం !"

" ......... అదికాద్సార్ ........ ! వాడంటె నాకేమన్న పగనా ? ...... వానస్మంటి కొడుకులు నాకు కూడా వున్నారు. కానేం జేయమంటరు? ..... డ్యూటీల వుండేవరకు, వాడు అసలె నోరు మెదపకుంట వుంటే తప్పలేదు!"

"బాస్టర్డ్! ....... మళ్ళీ కథలు చెప్పకు! రేపువాడి చావుమీద అందరూ గొడవచేస్తే సమాధానం ఏం చెప్పాలి? ....... అవతల యింకో వారం రోజుల్లో ఢిల్లీనుండి కమీషన్ వస్తోంది తెలుసా ?!"

"అవన్ని నాకొదిలెయ్యండ్లి సార్! ...... ఆ పోరగాన్కి ఈడ ఓ ముసల్ది తప్ప ఎవర్లేరు."

"సరే! ...... ఈకేసు వల్ల డిపార్టుమెంట్‌కి ఏ చిన్న మచ్చవొచ్చినా నీకు జీవితం లేకుండా చేస్తాను తెలిసిందా "

"అలాగే సార్!"

"రేపుదయం కల్లా ట్రాన్స్‌ఫర్ ఆర్డరు పంపిస్తాను. వెంటనే రిలీవ్ అయి వెళ్ళిపో! ...... రాత్రి తొమ్మిది దాటింతరువాత శవాన్ని పోస్టుమార్టం చేయించి, దగ్గరుండి వాడి శవానికి అంత్యక్రియలు జరిపించు ....... ఏమాత్రం తేడా జరిగినా మొత్తం డిపార్టుమెంటు రాబోయే కమిషన్‌ముందు దోషిగా నిలబడాల్సివుంటుంది ....... అర్థమయ్యిందా?"

"యెస్సార్!"

అవతల ఫోన్ క్రెడిల్ చెసిన శబ్దం విన్పించింది.

ఒక్క నిమిషం కుర్చీలో వెనక్కి జారగిలబడి రిలాక్సయ్యాడు ఇన్స్పెక్టర్.

ప్లాన్ అంతా అనుకున్నట్టు సాఫీగా సాగినందుకు లోపల అతడి మనసు ఆనందంగా వుంది. ఇంకా ఒకట్రెండు, ఆపరేషన్స్ పూర్తిచేసి, ఇక్కడనుండి రిలీవ్ అయిపోతే చాలు ...... !

రాత్రి తొమ్మిదిదాటాక, శవాన్ని రహస్యంగా స్టేషన్ దాటించి, నింపాదిగా బయటికి

వొచ్చి, ఇంకా కొడిగట్టని ఆశతో అక్కడే కూర్చున్న చంద్రమ్మని సమీపించాడు.

స్టేషన్ ఆవరణలో మిణుకు, మిణుకు మంటున్న లైటుతప్ప మరోలైటేదీ చుట్టుపక్కల లేకపోవడంతో అక్కడంతా మసక, మసగ్గావుంది. ఆకాశం బాగా మబ్బుపట్టి వుంది. వర్షం రాబోతోందనడానికి సూచనగా చల్లగాలి రివ్వున వీస్తోంది.

ఇంకా ఏడవడానికి కన్నీళ్ళేమీ మిగలనికళ్ళతో చంద్రమ్మ, తనని సమీపించిన ఇన్స్పెక్టర్‌కేసి ఆశగా చూసింది.

"అయ్యా ...... ! నాకొడుకును వొదిలిపెడ్తాండ్లా బాంచెను !"

"నీ పేరేంది?"

"చంద్రమ్మ నాయినా !"

"పోరగాడు సూత్తె బుద్ధమంతుని లెక్కనె వున్నాడుగని వాడు ఎస్మంటి పనులు జేత్తాండో ఎర్కేనా చంద్రమ్మా !" ముందే వల్లెవేసుకున్న మాటల్లోంచి మొదటిమాటను వొదిలిపెట్టాడు.

చంద్రమ్మ అర్థంకాక అతడివైపు అయోమయంగా చూసింది.

"గవుర్మెంటుకు వ్యతిరేకంగా పనిజేత్తాండు! ....... గవుర్మెంటంటె ఎవలో ఎరికేనా ...... జనం .... అంటె నీ అస్మంటోళ్ళు ..... పోలీసోళ్ళు ..... అంటె నా అస్మంటోళ్ళు ...... మనకు వ్యతిరేకంగా పనిజేత్తాండు ...... వాని తాన బాంబులు దొరికినయ్!" మాట్లాడ్తోన్న ఇన్స్పెక్టర్ చంద్రమ్మ మొహంలో రియాక్షన్‌కోసం ఆగాడు.

చంద్రమ్మ యింకా అట్లాగే బిత్తరచూపులు చూస్తోంది.

"స్టేషన్‌కు దీసుకొచ్చినంక వాటితోని మమ్మల్ని సంపాల్నని సూశిండు ...... యిష్టంలేకున్నా వాన్ని సంపక తప్పలేదు ....... చంద్రమ్మా!.......

పోరగాని పానం బోయింది ....... యింతకుముందే దవాఖానకు దీస్కెబోయిండ్లు!"ఎక్కడో పిడుగుపడిన శబ్దం ........ భయంకరంగా!


ఈసారి చంద్రమ్మ ఏడవలేదు...... నెత్తి, నోరూ బాదుకోలేదు ........ పిడుగు పడింది మరి చంద్రమ్మ గుండెలోనే!

సన్నటి తుంపరతో వర్షం మొదలయ్యింది...... చంద్రమ్మ కళ్ళబదులు ఆకాశం వర్షిస్తోంది!

ఒక నిర్ణయానికి వొచ్చినదానిలా చంద్రమ్మ ఒక్కొక్క అడుగే వేసుకుంటూ రోడ్డుమీదకి నడిచింది.

బహుశా, ఆమె వందల అడుగులతో మళ్ళీ ఆ ప్రాంగణంలోకి అడుగు పెట్టొచ్చు!


**The creative touch by you...**



**REGIONAL OFFICE :**

Regency Ceramics Limited, 204, Swastik Chambers, C.S.T. Road, Chembur, Bombay - 400 071. Ph : 5520453.

AUTHORISED DEALERS : Associated Cement Corpn., Kalbadevi. Ph : 295635/316978 Maharashtra Steel Corpn., Dombivili. ph : 5916 Ronak Tiles & Marbles Corpn., Santacruz (West). Ph : 6491340/6490891/6483818 Sudarshan Ceramics, Chembur. Ph : 5520031/5527279/5522846 Vinubhai Chandulal & Co., Nagdevi Street. Ph: 3420335/3420336/3420337/3447839

ALSO AVAILABLE AT : Ceramic Corner, Andheri (W) Ph : 6208386 Maharashtra Steel Tube Co., Kalyan. Ph : 23507 / 25397 Ronak Ceramic, Khar (W) Ph : 540351/544599 .

Dealership enquires for unrepresented areas solicted. Special Prices offered for bulk requirements (4000 Sqft and above).

**Floors by Regency!**

Some love the looks,
others the muscle.
Some like the finish,
others the feel.
Some prefer thecolours,
others the designs.
Some go for
the Italian connection,
others for
the international quality.
One important fact is clear :
The Regency floor considers
everyone who lives on it !

REGENCY CERAMIC TILES

**Floor identity at last !**